ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

సగం కూడా వసూలు కాలా !

- మందకొడిగా ఆస్తి పన్ను వసూళ్లు
- రూ.62.63కోట్లకుగాను ఇప్పటి వరకు వసూలైంది రూ.30.26 కోట్లు
- మిగిలిందిక 8 రోజులే..



చిత్తూరు అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగర, పురపాలకలకు ఆస్తిపన్నులే పట్టుకొమ్మలు. వీటి ద్వారా వచ్చే ఆదాయంతోనే ఆయా మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనులను చేపడతారు. ప్రస్తుతం జిల్లాలోని ఒక నగరపాలక, నాలుగు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఎనిమిది రోజులే గడువుంది. ఈ నెలాఖరుకు పాత బకాయిలతో కలిపి మొత్తం రూ.62.63కోట్లు వసూలు చేయాలి. శనివారం నాటికి రూ.30.26కోట్లు వసూలైంది. కమిషనర్లు.. రెవెన్యూ విభాగం అధికారులను పరుగులు తీయిస్తున్నప్పటికీ ఆశించిన ఫలితం రావడం లేదు. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యమే పన్నులు వసూలు కాకపోవడానికి కారణమని ఉన్నతాధికారులు అంటున్నారు.

శనివారం వరకు వసూలైన పన్నుల వివరాలు

మున్సిపాలిటీ	భవనాలు	మొత్తం	వసూలు
		(రూ.కోట్లలో)	
చిత్తూరు	44,879	39.60	17.43
పుంగనూరు	13,639	7.20	4.56
పలమనేరు	13,447	4.92	3.25
కుప్పం	12,998	6.38	2.61
నగరి	14,837	4.53	2.41
మొత్తం	99,800	62.63	30.26

వడ్డీ మాఫీ కోసం ఎదురుచూపులు

ఆస్తి పన్నుపై గత ప్రభుత్వం వడ్డీమాఫీ చేసింది. ఈ సారి కూడా వడ్డీమాఫీ చేస్తే భారీ ఎత్తున పన్ను వసూలయ్యే అవకాశం ఉంది. పలువురు పన్ను చెల్లింపుదారులు కూడా ఇందుకోసం ఎదురుచూస్తున్నారు.

కొనసాగుతున్న పోలీసు బదిలీలు

- తాజాగా 12మంది ఎస్ఐలకు స్థానచలనం



చిత్తూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య ఘటన నేపథ్యంలో జిల్లాలో పోలీసుల బదిలీలు కొనసాగుతున్నాయి. తాజాగా శనివారం 12మంది ఎస్ఐలకు స్థాన చలనం కల్పిస్తూ ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు విడుదల చేశారు. వైసీపీ హయాం నుంచీ పోలీసులు అవే స్థానాల్లో కొనసాగడం వల్లే పుంగనూరు హత్య జరిగిందని, తన నియోజకవర్గంలో అలాంటి పోలీసుల్ని బదిలీ చేయమని చెప్పినా ఎస్పీ పట్టించుకోవడం లేదని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ మధ్య 45 మంది పోలీసుల్ని ఓ రోజు, 219 మందిని మరుసటి రోజు బదిలీ చేశారు. వీరిలో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు సుమారు 50 మంది ఉండగా, 264మందిని బదిలీ చేయడం అన్యాయమని పోలీసు వర్గాల్లో చర్చ కూడా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఇది చర్చనీయాంశంగా మారింది. తాజాగా శనివారం 12 మంది ఎస్ఐలకు స్థాన చలనం కల్పించడంతో బదిలీలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. 12మందిలో ముగ్గుర్ని స్టేషన్ల నుంచి బదిలీ చేయగా, వీఆర్‌లో వున్న 9మందికి స్టేషన్లు కేటాయించారు. 12 మందిలో సహదేవి మినహా 11 మందీ ప్రమోటీ ఎస్ఐలే కావడం విశేషం.

- పెద్దపంజాణి ఎస్ఐగా పనిచేస్తున్న సహదేవి వైసీపీ హయాం నుంచీ అక్కడే పనిచేస్తున్నారని, ఆమె భర్త వైసీపీ నేత అని, ఎంపీ మిథున్‌రెడ్డికి ముఖ్య అనుచరుడని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. తాజా బదిలీల్లో ఆమెకు చిత్తూరు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు పోస్టింగ్ ఇచ్చారు.
- ఎన్నికలకు ముందు నుంచీ విజయపురంలో పనిచేస్తున్న బలరామయ్యను చిత్తూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు మార్చారు. ఈయన వైసీపీ వారితో అనుకూలంగా ఉంటున్నారని, అవినీతి ఆరోపణలు ఉన్నాయని, అందుకే డీటీసీకి మార్చారని చెబుతున్నారు.
- చిత్తూరు టూ టౌన్ ఎస్ఐ ప్రసాద్ కూడా వైసీపీ హయాంలో చిత్తూరు వన్ టౌన్‌లో పనిచేశారు. ఈయన మీద కూడా అవినీతి ఆరోపణలు ఉండడంతో బంగారుపాళ్యం యూపీ స్టేషన్‌కు మార్చినట్లు తెలుస్తోంది.
- ఇక మిగిలిన 9 మంది ఎస్ఐలు ఇటీవల సత్యసాయి జిల్లా నుంచి చిత్తూరుకు వచ్చారు. వీరంతా ప్రమోటీలే. ఎర్రిస్వామికి చిత్తూరు వన్ టౌన్, వెంకటరమణకు టూటౌన్, తులసన్నకు సీసీఎస్, రామచంద్రయ్యకు పెనుమూరు, విజయ్ నాయక్‌కు నగరి యూపీఎస్, వెంకటనారాయణకు ఎన్ఆర్‌పేట, కె.రంగాకు విజయపురం, వెంకటరమణకు పుంగనూరు యూపీఎస్, ధనంజయరెడ్డికి పెద్దపంజాణి స్టేషన్లను కేటాయించారు.

పెండింగ్ కేసులు త్వరగా పూర్తిచేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి సురేష్ రెడ్డి - హైకోర్టు జడ్జితో ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయమూర్తులు

- హైకోర్టు జడ్జి జస్టిస్ సురేష్ రెడ్డి

చిత్తూరు లీగల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో పెండింగ్ ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని హైకోర్టు న్యాయమూర్తి సురేష్ రెడ్డి కోరారు. శనివారం చిత్తూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి చిత్తూరుజిల్లా పరిధిలోని న్యాయమూర్తులకు కేసుల విషయమై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి న్యాయమూర్తి చట్టాలపై అవగాహన పెంచుకుని కేసులను త్వరగా పూర్తిచేసేలా తమవంతు పాత్ర పోషించాలన్నారు. కేసులు పెండింగ్‌లో ఉంటే కక్షిదారులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం కేసుల పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావుతో పాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

'రేషన్'కు ఈకేవైసీ తప్పనిసరి

- ఈనెల 31లోగా చేసుకోకుంటే ఇబ్బందులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. ఈనెల 31వ తేదీలోపు చేసుకోకుంటే ఏప్రిల్ నుంచి బియ్యం తీసుకోవడానికి ఇబ్బందులు వస్తాయంటున్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా జరుగుతున్న పంపిణీలో పారదర్శకత కోసం జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసీ) ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. ఇప్పటివరకు రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ లేకున్నా సరుకులు ఇచ్చేవారు. ఇకపై అలా కుదరదని, కార్డుదారులు ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ చేసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రేషన్ డీలర్లు, తహసీల్దార్లు, డీఎస్వోలు, కలెక్టర్ల (సివిల్ సప్లయ్స్)లాగిన్లలో ఈకేవైసీ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల మొబైల్ యాప్, రేషన్ షాపుల్లోని ఈ-పోస్ పరికరాల ద్వారా ఈకేవైసీని అప్‌డేట్ చేసుకునే సౌకర్యం ఉంది. ఐదేళ్లలోపు పిల్లలుమినహా మిగిలినవారు ఈకేవైసీ ప్రక్రియను గడువులోగా పూర్తిచేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌడ్ స్పష్టం చేశారు.

జిల్లాలో మిగిలింది 1,84,950 మంది

జిల్లాలో 5,36,686 మంది వరకు బియ్యం కార్డుదారులున్నారు. ప్రతి కార్డులోని సభ్యుల సంఖ్యను యూనిట్‌గా పేర్కొంటున్నారు. దీని ప్రకారం జిల్లాలో 16,70,470 యూనిట్లు ఉన్నాయి. శనివారం నాటికి కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్లు చొరవ తీసుకుని 14,85,520 యూనిట్ల ఈకేవైసీ పూర్తిచేశారు. ఇంకా 1,84,950 మంది ఈనెల 31వ తేదీలోగా నమోదు చేసుకోకుంటే వీరికి ఏప్రిల్ నెలలో బియ్యం పంపిణీ నిలిచిపోతుంది.

రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌కు
10మంది ఉమ్మడి జిల్లా విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంటుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, నెహ్రూయువకేంద్ర యూత్ అధికారి ప్రదీప్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుశీలా భారతి శనివారం తెలిపారు. శుక్రవారం పీవీకేఎన్‌లో భారత ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించగా 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 75 మంది విద్యార్థులు ఒకేదేశం-ఒకే ఎన్నిక అనే అంశంపై ప్రసంగించిన విషయం తెలిపిందే. ఇందులో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన హరినాయుడు, మనోహర్, మునిచంద్ర నాయుడు, ఉమాదేవి, ప్రదీప్‌కుమార్‌లు 10 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల్లో.. తిరుపతి ఎమరాల్డ్ డిగ్రీ కళాశాలకు చెందిన రాజ్వి బావ్సార్, అక్షిత, పి.మోహిత, ఎ.చూడామణి కృష్ణ, అజిత్ కృష్ణలతోపాటు సయ్యద్ అబ్దుల్ అజీజ్ (మోహన్‌బాబు యూనివర్సిటీ, తిరుపతి), ప్రగతి జైస్వాల్ (మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి), సాన్య(అపోలో యూనివర్సిటీ, చిత్తూరు),కె.ఎస్.వైష్ణవి (విజయం డిగ్రీ కళాశాల, చిత్తూరు), పి.గోపీచంద్ (ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, తిరుపతి) ఉన్నారు. వీరంతా ఈనెల 28న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్‌లో అక్కడ ఎంపిక చేసిన అంశంపై రాష్ట్ర స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముందు తమ వాణి వినిపించనున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:29 (ఆదివారం సాయంత్రం) సహర్: 4:55 (సోమవారం ఉదయం)

రేపు టీటీడీ బోర్డు సమావేశం

- సీఎం సూచనలపై చర్చ
- 2025-26 బడ్జెట్ సమర్పణ

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. అన్నమయ్య భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అలాగే గతంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించడంతో పాటు ఇప్పటికే సిద్ధం చేసిన అజెండాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చిన సీఎం చంద్రబాబు బోర్డుకు, అలాగే సభ్యులకు చేసిన పలు సూచనలపై కూడా చర్చించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం నూతన ట్రస్టును ఏర్పాటు చేయాలనే సూచనకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. అలిపిరిలో కొండలకు వెంబడి ఉన్న ప్రాంతాన్ని టెంపుల్ కారిడార్‌గా చేసే అంశంపైనా చర్చించనున్నారు. అన్యమత ఉద్యోగుల తరలింపు, శ్రీవారి ఆస్తుల పరిరక్షణ వంటి అంశాలు కూడా చర్చకు రానున్నాయి.

పరీక్షకు వెళ్తూ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



లారీని ఢీకొని బైక్‌పై నుంచి కిందపడ్డ భువన్‌మనో, వంశీ



భువన్‌మనో (ఫైల్ ఫొటో)

మరో విద్యార్థికి తీవ్రగాయాలు

వడమాలపేట/బైరెడ్డిపల్లె, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పరీక్షకు వెళ్తూ మృత్యువాత పడ్డాడో ఇంజనీరింగ్ విద్యార్థి. మరో విద్యార్థి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై వడమాలపేట టోల్ ప్లాజా వద్ద శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామానికి చెందిన వెంకటరామయ్య కుమారుడు వంశీ(20), బైరెడ్డిపల్లె మండలం గాజీపేటకు చెందిన నరసింహులు కుమారుడు కేఎన్ భువన్‌మనో(20) పుత్తూరు సమీపంలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. తిరుపతి సమీపంలోని చెర్లోపల్లి అయాన్ డిజిటల్ కేంద్రంలో జరుగుతున్న ఎన్‌పీ టెల్(నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్) ఆన్‌లైన్ కోర్సు పరీక్ష రాసేందుకు కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. చెన్నై నుంచి కర్నూలుకు జిప్సం లోడ్‌తో వెళుతున్న టీఎన్ 23 బీఈ 8084 నంబరు లారీని టోల్‌గేట్ సమీపంలోని చెట్టినాడ్ హోటల్ వద్ద భోజనం కోసం డ్రైవర్ రోడ్డు పక్కగా నిలిపే ప్రయత్నం చేశాడు. దీన్ని గమనించేలోపు భువన్‌మనో నడుపుతున్న ద్విచక్ర వాహనం లారీ వెనుక భాగంలో ఢీకొంది. ఈ ఘటనలో భువన్‌మనోకు హెల్మెట్ లేకపోవడంతో తల బలంగా ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు.వెనుక కూర్చున్న వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ధర్మారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వంశీని 108లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. భువన్‌మనో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి పంపించారు.అది పూర్తయ్యాక శనివారం రాత్రి భువన్ మృతదేహం గాజీపేట చేరింది. ఆదివారం స్వగ్రామంలో భువన్ అంత్యక్రియలు జరగనున్నాయి.

విద్యాశాఖకు సవాలుగా ఆ రెండు పరీక్షలు..!?

చిత్తూరు సెంట్రల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమ, బుధవారాల్లో జరగనున్న పదో తరగతి గణితం, భౌతికశాస్త్రం పరీక్షలు విద్యాశాఖకు సవాలుగా మారాయన్న చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఐదుగురు ఇన్విజిలేటర్లను విధులకు దూరంగా ఉంచారు. టెన్త్ ఓపెన్ పరీక్ష కేంద్రాల్లో పుస్తకాలున్నట్లు గుర్తించిన జిల్లా పరిశీలకులు వాటిని తొలగించిన విషయం తెలిసిందే. పలుచోట్ల ఒక్కో బెంచీపై ఇద్దర్ని కూర్చోబెట్టడంపై విద్యాశాఖ అధికారులు సీరియస్ అయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులున్నారనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో మాస్ కాపీయింగ్‌కు ఉపాధ్యాయులే సహకరిస్తున్నారనే వాదనలు గట్టిగానే వినిపించాయి. సమస్యాత్మక కేంద్రాల్లో ఒకటైన రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో అమర్చిన సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటనలు లేకపోలేదు. గంగాధరనెల్లూరు ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ పరీక్షలకు బిట్లు అందించడంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో గణితం, సైన్స్ పరీక్షలు జరిగే రోజుల్లో ఇటు గ్రామీణ, అటు పట్టణ ప్రాంతాల్లో ఎలాంటి కట్టుదిట్టమైన చర్యలు అధికారులు తీసుకుంటారన్న చర్చ జరుగుతోంది.

కాంపోజిట్ పరీక్షలకు 2499 మంది హాజరు

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల్లో ప్రథమ భాష పేపర్-2 కాంపోజిట్ కోర్సు, ఓఎస్ఎస్‌సీ పేపర్-1 పరీక్షలు నిర్వహించారు. 2503 మంది విద్యార్థులకు 2499 మంది హాజరవగా నలుగురు మాత్రమే గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. డీఈవో మూడు కేంద్రాలు, 13 ఫ్లయింగ్ స్క్వాడ్లు 46 కేంద్రాలను పరిశీలించారు. ఏకంగా 48 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు విధులు నిర్వహించినట్లు డీఈవో పేర్కొన్నారు.

తిరుమలలో మళ్లీ ప్లాస్టిక్ బాటిల్స్?

గాజుసీసాల స్థానంలో అనుమతించేందుకు టీటీడీ యోచన

తిరుమల, మార్చి22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గాజు నీళ్ల సీసాల స్థానంలో మళ్లీ ప్లాస్టిక్ బాటిల్స్‌ను అనుమతించే ఆలోచనలో టీటీడీ ఉన్నట్టు తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణ దృష్టితో 2020లో తిరుమలలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. ఇందులో భాగంగానే వాటర్ బాటిళ్ల స్థానంలో గాజు సీసాలు ప్రవేశపెట్టారు. ఒక లీటర్ బాటిల్ రూ.50. ఏ దుకాణంలో బాటిల్ వెనక్కి ఇచ్చినా రూ.30 ఇస్తారు. అయితే చాలామంది భక్తులు వెనక్కివ్వకుండా పడేస్తున్నట్టు గుర్తించారు. ఇవి పగిలి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనికితోడు గొడవపడ్డ సమయంలో భక్తులు గాజు సీసాలను ఆయుధాలుగా వాడేస్తున్నారు. గత జూలైలో వైజాగ్‌కు చెందిన ఒక కుటుంబంతో మాటామాటా పెరిగి దుకాణంలో పనిచేసే వ్యక్తి గాజు సీసాతో దాడి చేయడంతో భక్తుడు, అడ్డు వెళ్లిన హోంగార్డు గాయపడ్డారు. తాజాగా గురువారం మరో సంఘటనలో కర్ణాటక, తమిళనాడు భక్తుల మధ్య జరిగిన ఘర్షణలో గాజు బాటిల్‌తో దాడిలో ఇద్దరు రక్తగాయాలపాలయ్యారు. వీటి స్థానంలో బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ బాటిళ్లు, టెట్రా వాటర్ ప్యాకెట్ల వినియోగంపై టీటీడీ ఉన్నతాధికారులకు కొన్ని సంస్థలు డెమో ఇచ్చాయి.వీటి వినియోగంపై పరిశీలనకు ఓ ప్రత్యేక కమిటీని టీటీడీ ఈవో శ్యామలరావు నియమించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



గాజు వాటర్ బాటిళ్లు



ముసలిమడుగు వద్ద ఎలిఫెంట్ క్యాంపును పరిశీలిస్తున్న సీఎఫ్ యశోద, డీఎఫ్‌వో భరణి

ఎలిఫెంట్ క్యాంపు పనులు వేగవంతం చేయండి

పలమనేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలోని ముసలిమడుగు వద్ద కుంకీ ఏనుగుల విడిది కోసం ఏర్పాటు చేస్తున్న ఎలిఫెంట్ క్యాంపును శనివారం అటవీశాఖ సీఎఫ్ యశోద, జిల్లా అటవీశాఖ అధికారిణి భరణి సందర్శించారు. ఈ సందర్భంగా ఎలిఫెంట్ క్యాంపు వద్ద వెలుపలి నుంచి వన్యప్రాణులు, ఏనుగులు ప్రవేశించకుండా చుట్టూ తవ్విన కందకాలు, హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్, కుంకీ ఏనుగులు నీరు తాగేందుకు, స్నానం చేసేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటి వరకు దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ వివరించారు. మిగిలిన పనులను మరో 20 రోజుల్లోపు పూర్తిచేయాలని సీఎఫ్ యశోద సూచించారు. కార్యక్రమంలో పలమనేరు రేంజర్ నారాయణ, క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

- గుడిపాల ఎస్ఐకి గాయాలు

గుడిపాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కారును లారీ ఢీకొట్టడంతో గుడిపాల ఎస్ఐ రామ్మోహన్‌కు గాయాలయ్యాయి. విధి నిర్వహణలో భాగంగా శనివారం సాయంత్రం ఎస్ఐ తన సొంత కారులో వెళుతున్నారు. గుడిపాల మండలంలోని పశుమంద క్రాస్ వద్దకొచ్చేసరికి కారును వెనుకవైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వెనుకభాగం ధ్వంసమవగా, అందులోని ఎస్ఐ గాయపడ్డారు. ఆయన్ను చికిత్స నిమిత్తం 190 రామాపురం సీఎంసీలో చేర్పించారు.




దర్శకుడు క్రిష్ - అమరనాథ్ నంబూత్రి

తిరుమలలో దర్శకుడు క్రిష్

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు క్రిష్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే అమరనాథ్ కేదార్‌నాథ్ వంశపారంపర్య అర్చకులు అమరనాథ్ నంబూత్రి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

అహోబిలం పీఠాధిపతికి టీటీడీ పెద్ద మర్యాద

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): అహోబిలం పీఠాధిపతి శ్రీరంగనాథ యతీంద్ర జీయర్‌స్వామి శనివారం టీటీడీ పెద్ద మర్యాదతో శ్రీవారిని దర్శించుకున్నారు. అఖిలాండం వద్ద పీఠాధిపతికి టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం శఠగోపంతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

టెంపుల్ కారిడార్‌గా అలిపిరి మంచి నిర్ణయం: భానుప్రకాష్



తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): అలిపిరి ప్రాంతాన్ని టెంపుల్ కారిడార్‌గా నిర్ణయించి భవిష్యత్తులో ఎలాంటి ధార్మిక వ్యతిరేక కార్యక్రమలూ జరగకుండా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. తిరుమల ఆలయం ముందు శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను సీఎం చంద్రబాబు రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇక, శ్రీవారి ఆలయంలోని పరకామణిలో జరిగిన కోట్లాది రూపాయల దొంగతనంపై సీఐడీ విచారణకు డిమాండ్ చేస్తున్నానన్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,170
తలనీలాలు సమర్పించినవారు: 26,821

'తుడా' టవర్స్‌కు పెరుగుతున్న క్రేజ్

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఇక ఆకాశ హర్మ్యాలు రాబోతున్నాయి. మహానగరాల్లో మాత్రమే కనిపించే ఆధునిక హంగులు, సకల సౌకర్యాల సౌధాలు క్యూ కడుతున్నాయి. చింతలచేనులో ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థ 13 అంతస్తులతో రెసిడెన్షియల్ టవర్స్ నిర్మించింది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో 14 అంతస్తుల్లో తుడా టవర్స్ పేరిట వేగంగా నిర్మాణం సాగుతోంది. దీనికి జనం నుంచి క్రేజ్ కనబడుతోంది.

తొలుత 20 అంతస్థులతో ఐకానిక్ టవర్స్ నిర్మించాలని 'తుడా' ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుంది. డీపీఆర్ సిద్ధం చేసింది. చివరి నిమిషంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అభ్యంతరం చెప్పింది. డీజీసీఏ నిబంధనల ప్రకారం విమానాశ్రయం 5 కి.మీ వ్యాసార్థంలో ఏ భవనం కూడా 45 మీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదు. అంటే భవనం 14 అంతస్తులపైన నిర్మాణం చేయకూడదు. తుడా టవర్స్ దూరం 10 కి.మీ పైనే ఉన్నప్పటికీ ఎయిర్ ట్రాఫిక్ ఆ ప్రాంతం నుంచే ఎక్కువగా ఉండడంతో ఎన్వోసీ ఇవ్వనట్టు తెలుస్తోంది. దీంతో 14 అంతస్తులకు పరిమితం చేసుకుని.. మళ్లీ రీడిజైన్ చేసి నిర్మాణం మొదలుపెట్టింది. వైసీపీ హయాంలో తుడా టవర్స్ పునాదుల్లో ఉన్నప్పుడే వేలం పిలిచారు. రెండు, మూడు కమర్షియల్ గదులు తప్ప తక్కినవాటికి బోణీ కాలేదు. ప్రభుత్వం మారితే నిర్మాణం ఆగిపోతుందేమోనన్న భయం కొనుగోలుదారుల్లో కనిపించింది.



ఇప్పుడేమో ప్రభుత్వం మారాక పనులు వేగవంతమయ్యాయి. ఆరంతస్తుల నిర్మాణం పూర్తిచేసుకుని వేలానికి సిద్ధమైంది. ఈనెల 8నుంచి వేలం ప్రక్రియ మొదలైనప్పటికీ శని, ఆదివారాలు సెలవులు రావడంతో మూడు రోజుల్లోనే 23 ప్లాట్లు అమ్ముడుపోయినట్టు అధికారులు చెబుతున్నారు. 'తుడా టవర్స్‌కు విశేష స్పందన వస్తోంది. ఇప్పటికే కొన్ని బ్యాంకులు, కంపెనీలు ఆఫీస్ స్పేస్ కోసం పోటీ పడుతున్నాయి. వచ్చే ఏడాది మార్చిలోపు కొనుగోలుదారులకు అప్పగిస్తాం' అని తుడా వీసీ ఎన్.మౌర్య తెలిపారు.

ఏడాదికి అందుబాటులోకి

3.6 ఎకరాల్లో రూ.345కోట్లతో 'తుడా' టవర్స్ నిర్మాణం సాగుతోంది. గ్రౌండ్, ఒకటవ అంతస్థుల్లో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన వాటిలో 230 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. వీటిలో 42 డబుల్.. 152 ట్రిపుల్.. 32 నాలుగు బెడ్ రూమ్ ఫ్లాట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. కమర్షియల్, రెసిడెన్సియల్‌కు వేర్వేరుగా పార్కింగ్, లిఫ్టులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాదిలోపు పూర్తిగా అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఐకానిక్ టవర్స్‌లో వసతులు, ధరలు ఇలా..

స్విమ్మింగ్ పూల్, వాకింగ్ పార్కు, పోడియం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రెస్టారెంట్, బంకెట్ హాల్, సూపర్ మార్కెట్, బ్యాంక్, బ్యాడ్మింటన్ కోర్టులు, యోగ ఇతర ఇండోర్ క్రీడల సౌకర్యాలను అందుబాటులో ఉంచనున్నారు. రెసిడెన్షియల్ కోసం 2బీహెచ్‌కే.. 1238 ఎస్ఎఫ్టీ- రూ.70లక్షలు, 3బీహెచ్‌కే.. 1903 ఎస్ఎఫ్టీ- రూ.1.12కోట్లు, 4బీహెచ్‌కే.. 3743 ఎస్ఎఫ్టీ- రూ.2.19కోట్లు చొప్పున ధరలు నిర్ణయించారు. కమర్షియల్ కోసం గ్రౌండ్ ఫ్లోర్.. 42664 ఎస్ఎఫ్టీ- ఒక్కో ఎస్ఎఫ్టీ రూ.12వేలు చొప్పున, ఫస్ట్ ఫ్లోర్ 64724 (రూ.10వేలు), ఆఫీస్ స్పేస్ 89919 ఎస్ఎఫ్టీ (రూ.7,500) ధరగా నిర్ణయించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆఫ్‌లైన్‌లో అద్దె చెల్లింపులకు ఆదేశం

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఇళ్లు, దుకాణాలు, మఠాలు, కార్యాలయాలకు సంబంధించిన అద్దె, కరెంటు, వాటర్ బిల్లులు ఆఫ్‌లైన్ ద్వారా కూడా కట్టించుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను శనివారం ఆదేశించారు. అద్దె, కరెంటు, వాటర్ బిల్లులను ఆన్‌లైన్‌లో కట్టాలనే నిబంధనతో తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న కౌంటర్‌లో కంప్యూటర్‌కు యాక్సెస్‌ను గురువారం నుంచి కట్ చేసిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారంటూ 'తిరుమలలో ఆగిన ఆఫ్‌లైన్ అద్దె చెల్లింపులు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు స్థానికులకు ఇబ్బంది లేకుండా కౌంటర్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శనివారం నుంచే కౌంటర్‌ను తెరవాలని అధికారులు ఆదేశించినప్పటికీ బ్యాంక్ సెలవు నేపథ్యంలో తిరిగి సోమవారం నుంచి కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని బ్యాంక్ సిబ్బంది తెలిపారు.

అభాగ్యుడికి అండగా...
ఆంధ్రజ్యోతి-వైద్యజ్యోతి

● కలెక్టరు చొరవతో ఉచిత వైద్యానికి భరోసా

తిరుపతి(వైద్యం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు రోజుల వైద్యజ్యోతి మెగా హెల్త్‌క్యాంప్‌లో ఒక అభాగ్యుడికి కలెక్టర్ చొరవతో వైద్య సాయానికి మార్గం సుగమం అయ్యింది. నా అనే వాళ్లు లేక, ఆరోగ్య పరిస్థితి సహకరించక శ్రీకాళహస్తిలోని ఒక అనాథాశ్రమంలో ఉంటూ జీవనం సాగిస్తున్న బందాడ శ్రీనివాస్(76) వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవడానికి శనివారం వచ్చాడు. కలెక్టర్ వెంకటేశ్వర్ అతన్ని పలకరించారు. తన నిస్సహాయ స్థితిని అతను కలెక్టర్‌కి వివరిస్తూ కంట తడిపెట్టుకున్నాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన చేతిలోని మెడికల్ రిపోర్టులన్నీ తీసుకుని పరిశీలించారు. వెంటనే స్విమ్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వృద్ధుడికి అవసరమైన వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందజేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని స్విమ్స్‌కు లేఖ రాసి వృద్ధుడికి అందించి వెంటనే స్విమ్స్‌కు వెళ్లాలని సూచించారు. అందుకు అవసరమైన రవాణా సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయడంతో శ్రీనివాస్ పొంగుతున్న కన్నీళ్లతో కలెక్టర్‌కు చేతులు జోడించారు. ఆంధ్రజ్యోతి-వైద్యజ్యోతి శిబిరానికి రావడం తనకు ఎంతో మేలు చేసిందని కృతజ్ఞతలు తెలిపారు.



కలెక్టర్‌కు నమస్కరిస్తున్న బందాడ శ్రీనివాస్

మరో మైలురాయిని అధిగమించిన శ్రీసిటీ-కొబెల్కో



● కొబెల్కో నుంచి 20,000వ ఎక్స్‌కవేటర్ విడుదల

వరదయ్యపాళెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిర్మాణ పరికరాల తయారీ దిగ్గజ కంపెనీ కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా శ్రీసిటీ ప్లాంట్‌లో 20,000వ ఎస్‌కే 220 ఎక్స్‌కవేటర్ ఉత్పత్తితో ఒక ప్రధాన మైలురాయిని అధిగమించింది. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం కంపెనీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ అద్భుత విజయం పట్ల కేసీఈఐకి ఆయన అభినందనలు తెలిపారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రా సన్నారెడ్డి, కేసీఈఐ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్ సమక్షంలో ఎండీ, సీఈవో టకేమిచి హిరకావా లాంఛనంగా 20,000వ ఎక్స్‌కవేటర్‌ను విడుదల చేసి దానిని తమ ప్రధాన కస్టమర్ కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జలంధర్‌రెడ్డికి అందజేశారు. టకేమిచి హిరకావా మాట్లాడుతూ ఈ మైలురాయి తమ సంస్థ నిబద్ధతను సూచిస్తుందన్నారు. కేసీఈఐ ప్రారంభం నుంచి తమకు అమూల్యమైన సహకారం అందిస్తున్న శ్రీసిటీ ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ 20,000వ యూనిట్‌ను అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

20,000వ ఎక్స్‌కవేటర్ కీని జలంధర్‌రెడ్డికి అందచేస్తున్న కేసీఈఐ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్, ఎండీ, సీఈవో టకేమిచి హిరకావా, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రా సన్నారెడ్డి తదితరులు

'30 రోజుల్లో తెలుగు రీడింగ్ చాలెంజ్' ఎంతో ఉపయుక్తం

● ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి(విద్య), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన '30 రోజుల్లో తెలుగు రీడింగ్ చాలెంజ్' కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉందని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ పేర్కొన్నారు.తిరుపతికి చెందిన భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చారు. తిరుపతి సంజయ్ గాంధీ కాలనీ మున్సిపల్ పాఠశాల, చంద్రగిరిలోని జేఆర్‌కేఆర్ ప్రాథమిక పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడి విద్యా ర్థులకు శిక్షణ ఇచ్చారు. 30 రోజుల పాటు సాగిన శిక్షణ శనివారంతో ముగిసింది. తిరుపతి సంజయ్‌గాంధి కాలనీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆర్జేడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 3వ తరగతి విద్యార్థులతో 10వ తరగతి పుస్తకాలను చదివించి శిక్షణ ఫలితాన్ని పరిశీలించారు. అనంతరం



భాస్కర్‌రాజును సత్కరిస్తున్న ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ కేవీఎన్ కుమార్, ధనుంజయులు నాయుడు తదితరులు

ఆయన మాట్లాడుతూ మాతృభాషలో చదవడం, రాయడం బాగా వచ్చిన విద్యార్థులు ఇతర భాషల్లో కూడా ప్రావీణ్యత సాధించగలరన్నారు. ఈ శిక్షణద్వారా 2, 3 తరగతులు విద్యార్థులు కూడా 10వ తరగతి పాఠ్యపుస్తకాలను ధారాళంగా చదువుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్ని పాఠశాలల్లో 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టేలా ప్రయత్నిస్తామని చెప్పారు. డీఈఓ కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ 30 రోజుల్లో తెలుగు చదవడం, రాయడంపై శిక్షణతో సత్ఫలి తాలు వచ్చాయన్నారు. అనంతరం శిక్షకులు భాస్కర్‌రాజును ఆర్జేడీ, డీఈఓ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, అర్బన్ ఎంఈవో భాస్కర్‌నాయక్, హెచ్ఎం ధనుంజయులునాయుడు, ఉపాధ్యాయులు పద్మావతి, విజయ్‌కుమారి, అనిత, అనిల్‌కుమార్, ప్రవీణ, లావణ్య, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ వలలో చిక్కిన మహిళ

● రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఒక మహిళ సైబర్ వలలో చిక్కి రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న ఘటన తిరుపతి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు చెప్పిన వివరాల మేరకు.. సాయినగర్ పంచాయతీ టెలిఫోన్ కాలనీకి చెందిన మహిళ కాంట్రాక్టు టీచర్‌గా పనిచేస్తోంది. ఆమె ఇన్వెస్ట్‌మెంటు అలియన్స్ ట్రెయినింగ్ గ్రూపు వీఐపీ సీ9 హరిసింగ్ బుక్ డిస్కషన్ కెనాన్ అసెట్స్ దత్తా అనే వాట్సాప్ గ్రూపులో చేరారు. అధిక డబ్బు ఆశ చూపించి గ్రూపు అడ్మిన్లు హరిసింగ్, కెనాన్ అసెట్స్ దుత్తా క్వాలిటీ పవర్ ఐపో బీజెసాన్ ఐపో హెక్సావేర్ టెక్నాలజీస్ ఐపో స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టమని ప్రేరేపించారు. వారు సూచించిన మేరకు బంధన్, ఐడీఎఫ్‌సీ, యూకో, ఆర్ఎంజీబీ తదితర 10 బ్యాంకు అకౌంట్లకు ఆమె రూ.55.85 లక్షలు జమచేశారు. కొన్ని రోజుల తర్వాత వాట్సాప్ గ్రూపులు క్లోజ్ అయ్యాయి. నిర్వాహకులు అందుబాటులో లేకుండాపోయారు. మోసపోయానని గుర్తించిన బాధితురాలు వెంటనే సైబర్ క్రైం 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ కేసు నమోదు చేశారు.

రూ.22 లక్షలు పోగొట్టుకున్న మరో యువతి

సైబర్ మోసగాళ్ల వలలో పడి ఓ యువతి రూ.22 లక్షలు పోగొట్టుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ కథనం మేరకు.. స్థానిక జీవకోన గోపాల్‌నగర్‌లో ఉంటున్న రేవతి బీటెక్ వరకు చదువుకుంది. వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేస్తోంది. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ యాప్ ద్వారా ఆమె వాట్సాప్ నెంబరుకు ఓ మెసేజ్ పెట్టారు. టెలిగ్రామ్ యాప్‌లో హోటళ్లకు ఆన్‌లైన్ రివ్యూల ద్వారా రేటింగ్ ఇస్తే డబ్బులు వస్తాయని నమ్మించారు. అలాగే నమ్మకంగా చేస్తే సంస్థలో ఉద్యోగం కూడా ఇస్తామని చెప్పారు. వారి మాటలు ఆమె నమ్మింది. ఇంట్లో ఉన్న బంగారం తాకట్టు పెట్టి కొంత నగదు, తన అకౌంట్లో ఉన్న డబ్బులతో పాటు తెలిసిన వారి వద్ద అప్పులు చేసింది. మొత్తం రూ.22 లక్షలు కేటుగాళ్లు చెప్పిన అకౌంట్లలో నాలుగు విడతల్లో జమచేసింది. ఆ తర్వాత వారి వాట్సాప్ నెంబర్లు బ్లాక్ కావడంతో మోసపోయానని గ్రహించి 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. శనివారం అలిపిరి సీఐ రాంకిషోర్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేశారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల గుర్తింపు

● ఇందులో ఓ పాతనేరస్తుడు కూడా..



తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం పోలీసులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో 72 అనధికార వ్యక్తులను గుర్తించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు మూడు బృందాలుగా ఏర్పడి తిరుమలలోని వరాహస్వామి, కల్యాణకట్ట, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఎలాంటి గుర్తింపు లేకుండా ఉంటున్న 72 మందిని గుర్తించారు. వారి పూర్వాపరాల గురించి ఆరా తీశారు. వారిని తిరుపతి తరలించార. ఇందులో 28 మంది స్త్రీలు ఉన్నారు. పోలీసులు గుర్తించిన అనధికార వ్యక్తుల్లో ఓ పాత నేరస్థుడు కూడా ఉండటం గమనార్హం. ప్రకాశం జిల్లాకు చెందిన రవి అనే పాతనేరస్థుడి వివరాలు బయటపడ్డాయి. తిరుమల ట్రాఫిక్,తిరుపతి ఎంవీఐ మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకుని రూ.1.50లక్షలు జరిమానా విధించారు.

రామచంద్రాపురం ఎస్ఐ వీఆర్‌కు..
ట్రైనీ ఐపీఎస్ హేమంత్‌కు బాధ్యతలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎస్ఐ రామాంజనేయులును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌ను స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఈయన ఎనిమిది నెలల పాటు అక్కడ విధి నిర్వహణలో ఉంటారు.

కేకేసీ కళాశాల విద్యార్థులకు ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందును ఆరగిస్తున్న విద్యార్థులు

పుత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో వివిధ మతాల విద్యార్థుల మధ్య అన్యోన్యత, సోదరభావం పెంచేందుకు రంజాన్ ఇఫ్తార్ విందును ఆనవాయితీగా అందిస్తున్నామని కేకేసీ హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శరవణన్ తెలిపారు. రంజాన్ ఇఫ్తార్ విందును శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులు రంజాన్ ఉపవాసాలను భక్తి శ్రద్ధలతో చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్లు కుప్పయ్యశెట్టి, నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి
ప్లాట్‌ఫామ్ పైకి బ్యాగ్ విసిరిన ప్రయాణికుడు

● నాలుగు కిలోల గంజాయి సీజ్




రైలులో నుంచి విసిరిన బ్యాగ్ - గంజాయి ప్యాకెట్లు

దొరవారిసత్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తు తెలియని ప్రయాణికుడు ప్లాట్‌ఫామ్ పైకి విసిరిన బ్యాగ్‌లో గంజాయి ఉన్నట్లు జీఆర్పీ పోలీసులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం కామాఖ్య నుంచి చెన్నై మీదుగా యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దొరవారిసత్రం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ పైకి నల్ల బ్యాగ్‌ను విసిరేశాడు. బ్యాగ్‌లో ఏముందోనన్న ఆందోళనతో అప్రమత్తమైన రైల్వేస్టేషన్ సిబ్బంది జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్పీ ఎస్ఐ చెన్నకేశవ సిబ్బందితో కలిసి బ్యాగ్‌ను పరిశీలించగా నాలుగు కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. తమిళనాడుకు గంజాయిని తరలించే క్రమంలో పోలీసుల కంట పడి గంజాయి ప్యాకెట్లు ఉన్న బ్యాగ్‌ను ప్లాట్‌ఫామ్ పైకి విసిరేసి ఉంటారని జీఆర్పీ పోలీసులు అనుమానిస్తున్నారు. గంజాయిని సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు.

ముగిసిన కేజే కృష్ణమూర్తి అంత్యక్రియలు

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కేజే కృష్ణమూర్తి అంత్యక్రియలు శనివారం ముగిశాయి. కపిలతీర్థం రోడ్డులోని రామచంద్రనగర్‌లోని ఆయన నివాసం నుంచి అశ్రునయనాల నడుమ అంతిమయాత్ర హరిశ్చంద్ర శ్మశాన వాటిక వరకు సాగింది. అక్కడ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కృష్ణమూర్తి భౌతిక కాయానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, సప్తగిరి పత్రిక చీఫ్ ఎడిటర్ రాధారమణ, టీటీడీ సీపీఆర్వో రవి, విశ్రాంత ప్రొఫెసర్ సర్వోత్తమరావు, డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి, ఆకెళ్ల విభీషణశర్మ, ఎస్కేయూ ప్రొఫెసర్, బాల సుబ్రహ్మణ్యం, ఓఆర్ఐ డైరెక్టర్, సిబ్బంది, శ్వేత సిబ్బంది, టీటీడీ సిబ్బంది నివాళులు అర్పించారు.

భక్తులతో శ్రీవారిమెట్టు కిటకిట



చంద్రగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గం శనివారం భక్తులతో కిటకిటలాడింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. మరోపక్క కనీస వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులను టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది అదుపు చేయలేకపోయారు. దీంతో చంద్రగిరి పోలీసులు చేరుకుని వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఉదయం సమయంలో ఉచిత బస్సు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ఆటోవాలాలు ఇష్టం వచ్చినట్లు రేట్లు వసూలు చేస్తున్నారని భక్తులు వాపోయారు. టోకెన్ల ఆశ చూపి ఆటో డ్రయివర్లు ఇక్కడికి తీసుకువచ్చారని పలువురు భక్తులు చెప్పారు. టోకెన్ల కోసం కొందరు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. డిమాండుకు తగిన విధంగా టోకెన్లు ఇస్తే తమకు ఈ కష్టం ఎదురుకాదని వారు చెబుతున్నారు.

రేపు ఎల్లుండి విద్యుత్ సదస్సులు

రామచంద్రాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి సోమవారం, మంగళ వారాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఉన్నతాధికరుల ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు ఆశాఖ ఏఈ గిరి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9గంటలకు కుప్పంబాదూరు, సాయంత్రం 4గంటలకు నెత్తకుప్పం సబ్‌స్టేషన్లలో ఈఈ ఆశీర్వాదం, డీఈఈ శంకరయ్య ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు వెంకటరామాపురం, సాయంత్రం 4గంటలకు నడవలూరు సబ్‌స్టేషన్లలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తెలుగు సాహితీ సంఘాల ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం జరగనుంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి ఆసక్తి కలిగిన కవులు, రచయితలు పాల్గొనాలని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందులో పాల్గొనే వారిలో ఐదుగురు ఉత్తమ కవులను సత్కరిస్తారని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతి శిబిరానికి

అపూర్వ స్పందన





- ప్రారంభించిన కలెక్టర్ వెంకటేశ్వర్
- ప్రముఖ డాక్టర్ల పర్యవేక్షణలో హెల్త్ మీట్
- నేటితో ముగియనున్న వైద్యశిబిరాలు

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో మొదలైన వైద్యజ్యోతి శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు శిబిరానికి హాజరై ఉచితంగా వైద్య సలహాలు తీసుకున్నారు. శనివారం ఉదయం తుడా సర్కిల్లోని ఇందిరామైదానంలో ఏర్పాటుచేసిన ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతి కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. వివిధ ఆస్పత్రులు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. ఆయా ఆస్పత్రులు అందించే వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వైద్యజ్యోతి శిబిరంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది రాత్రి 8 గంటల వరకు సేవలందించారు. ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేశారు. అంతేకాకుండా రోగులకు అవసరమైన చికిత్స కోసం సంబంధిత ఆస్పత్రులకు వెళ్లేవారికి ప్రత్యేక రాయితీలను అందించారు.

నేడు కూడా హెల్త్ క్యాంప్

ఆదివారం కూడా మెగా హెల్త్ క్యాంప్ ఇందిరా మైదానంలో కొనసాగనుంది. తిరుపతిలోని ప్రసిద్ధ ఆస్పత్రుల స్టాళ్లలో ఉచితంగానే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ డాక్టర్లు పాల్గొంటారు. తిరుపతి నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

ప్రసిద్ధ ఆస్పత్రుల వైద్య సేవలు :

ఆంధ్రజ్యోతి- వైద్య జ్యోతిలో వెంకటరమణ గుండె, మెటర్నిటీ హాస్పిటల్ స్టాల్‌లో ఈసీజీతో పాటు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు ఇచ్చారు. మనోహరి రామచంద్ర హాస్పిటల్, అంకుర హాస్పిటల్స్ వారు తమ స్టాళ్లలో గర్భిణులు, తల్లి కావాలనుకునే మహిళలకు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. గర్భం దాల్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భస్థ శిశువుల ఆరోగ్య మెలకువలను వివరించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు ప్రధానంగా ఆర్థోపెడిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డీఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, యష్ హాస్పిటల్స్ శ్రీసాయి సుధా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, డీబీఆర్ అండ్ ఎస్కే క్యాన్సర్ సెంటర్, మెడిగో హాస్పిటల్స్, సన్‌ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ స్టాళ్లలో వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.కాకర్ల డెంటల్ హాస్పిటల్, కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్స్ వారు దంత సంబంధ పరీక్షలు నిర్వహించి, అధునాతన దంత వైద్యంపై అవగాహన కల్పించారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య సమస్యలతో సతమతం అయ్యే చాలామంది ఏ ఆస్పత్రికి వెళ్లాలో, ఏ డాక్టర్‌ను కలవాలో తెలియక ఇబ్బందిపడుతూ ఉంటారు. అటువంటి వారి కోసం ఒక్క చోటే ఇంత పెద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం. తిరుపతిలోని ప్రసిద్ధ ఆస్పత్రులన్నీ ఇక్కడ కన్పిస్తున్నాయి. ప్రముఖ డాక్టర్లంతా వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు ఇవ్వడం గొప్ప విషయం. ఇక్కడ పరీక్షలు చేయించుకున్నవారికి తమ ఆస్పత్రుల్లో ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తామంటున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలోకి రాని కొన్ని వ్యాధులకు ఇక్కడ ఉచితంగా చికిత్స దొరుకుతోంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ మెగా హెల్త్‌మీట్ నిర్వహించిన ఆంధ్రజ్యోతి- ఏబీఎన్‌కి ప్రత్యేక అభినందనలు.

- కలెక్టర్ వెంకటేశ్వర్

ఉచితంగా మందులు

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (ఎన్‌బీకే) ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పి.మనోహర్ రెడ్డి, కేపీ చౌదరి ప్రధాన స్పాన్సర్‌గా, సీపీఆర్ కనస్ట్రక్షన్స్ వారు కో స్పాన్సర్‌గా వ్యవహరించి రోగులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇంచార్జి వి.సుధాకరబాబు, ఏడీవీటీ ఇంచార్జి ఈశ్వరనాయుడు, ప్రొడక్షన్ ఇంచార్జి మోహన్ రావు, సర్క్యులేషన్ ఇంచార్జి ఉమాపతి, బ్యూరో ఇన్‌ఛార్జి శివప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.నరేంద్ర, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ శంకర్ రెడ్డి , ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగుల సమగ్ర సమాచారం కోసం

గజ-ప్రజ యాప్



గజ-ప్రజ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న రాకేష్ కాలువ

పలమనేరు, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏనుగుల సమాచారం కోసం ప్రభుత్వం కొత్తగా గజ-ప్రజ యాప్‌ను తీసుకొస్తున్నట్లు వైల్డు లైఫ్ బయాలజిస్టు రాకేష్‌కాలువ పేర్కొన్నారు.పలమనేరు అటవీశాఖ కార్యాలయంలో శనివారం పలమనేరు, కుప్పం, పుంగనూరు రేంజి పరిధిలో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాకేష్‌కాలువ మాట్లాడుతూ ఏనుగుల దాడులకు సంబంధించి ఎప్పటికప్పుడు నష్టవివరాలను ప్రభుత్వానికి పంపడానికి ఈ యాప్‌ను వినియోగించవచ్చన్నారు. ఇకపై ఈ యాప్ ద్వారానే ప్రభుత్వానికి ఏనుగుల సమాచారం ఎప్పటికప్పుడు అందే అవకాశం వుంటుందన్నారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఈ యాప్‌ను వినియోగించుకొని సత్వరమే ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాల్సిం వుంటుందన్నారు.రైతులు కూడా వారి సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుంటే వారికి ఏనుగుల వలన పంట నష్టం, ఆస్తినష్టం, జరిగినప్పుడు ఈ యాప్‌లో ఫొటోలను పంపవచ్చన్నారు.క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడికక్కడే ఈ యాప్‌లో రైతు పంపిన నష్టవివరాలను నిర్ధారించుకొని యాప్‌లో రైతుపేరు, తేది, సమయం, పంట విస్తీర్ణం తదితర వివరాలు అప్‌లోడ్ చేస్తారని, మళ్లీ రైతులు కార్యాలయాల వద్దకు వచ్చి వారి నష్టవివరాలను అర్జీల రూపంలో అందజేయాల్సిన అవసరం వుండదన్నారు. ఇందువలన నేరుగా ప్రభుత్వానికి సమాచారం వెళ్లడం ద్వారా వెంటనే నష్టపరిహారం రైతులకు అందజేసే అవకాశం వుంటుందన్నారు. ఈ యాప్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది ఏనుగుల సంచారానికి సంబంధించి వివరాలు అప్‌లోడ్‌చేస్తారని, దీనినిరైతులు చూసుకొని సమీపంలో ఏనుగులు వచ్చే అవకాశం వుందా అనేది నిర్ధారించుకోవచ్చన్నారు.పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్,రేంజర్లు నారాయణ, జయశంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కారు ఢీకొని చెల్లెలి దుర్మరణం

అన్నకు గాయాలు



నోమేశ్వరి మృతదేహం - గాయపడ్డ మహేష్

నగరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని చెల్లెలు దుర్మరణం చెందగా, అన్నకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరి మండలంలోని ఎంఎన్‌కండ్రిగ ఎస్టీకాలనీకి చెందిన గోపి, బుజ్జి దంపతులు వీకేఆర్‌పురంలో శనివారం కూలి పనికి వెళ్లారు. సాయంత్రం తమ తల్లిదండ్రుల వద్దకు మహేష్ (14), నోమేశ్వరి (10)లు ఇంటినుంచి బయల్దేరారు. వీకేఆర్‌పురం క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు ఒకటి వీరిని ఢీకొట్టింది. నోమేశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన మహేష్‌ను నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో బాలుడు తనను కాపాడండని రెండు చేతులు జోడించి మొక్కడంతో అందరినీ కంటతడి పెట్టించింది. సీసీ కెమెరాల సాయంతో కారు ఎవరిదన్నది గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీ తప్పనిసరి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):జూనియర్ కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నార్కోటిక్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో ఏర్పాటుచేసిన యాంటీ ర్యాగింగ్ కమిటీలాగే యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటుచేయాలని చెప్పారు. హైస్కూళ్లలో ఈగల్ క్లబ్‌లను చురుకైన విద్యార్థులతో ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాకు సరిహద్దులుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉండటంతో డ్రగ్స్ సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆర్టీసీ అధికారులు తరచూ చెన్నై, బెంగళూరు నుంచి వచ్చే బస్సులను తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబరు 1972కు లేదా సమీప పోలీసు అధికారులకు తెలియజేయాలని కోరారు. మెడికల్ షాపుల్లో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వరాదన్నారు.



గాయపడిన లక్ష్మీపతి, సునీత, పార్థసారథి

రెండు బైకులను ఢీకొట్టిన కారు

మహిళా సంరక్షణ కార్యదర్శి దంపతులతోపాటు మరొకరికి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తూ ముందు వెళ్తున్న, ఎదురుగా వస్తున్న బైకులను కారు ఢీకొట్టింది. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి దంపతులతోపాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం నాయుడుపల్లెకి చెందిన లక్ష్మీపతి(43) సొంత పనిపై బైక్‌పై ఎస్ఆర్‌పురానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. నాయుడుపల్లె సమీపంలోకి వచ్చేసరికి తిరుపతి జిల్లా పాకాల మండలానికి చెందిన నలుగురు ఓ కారులో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలో తమిళనాడులోని పళ్లిపట్టుకు వేగంగా వెళుతూ వెనుక నుంచి ఢీకొట్టారు. అదేసమయంలో ఎదురుగా ఎస్ఆర్‌పురం మండలంలోని ఏఎంపురం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి(మహిళా పోలీసు)గా పనిచేస్తున్న జీఎంఆర్‌పురానికి చెందిన సునీత(38) తన భర్త పార్థసారథి(38)తో కలిసి బైక్‌పై వస్తుండగా వీరినీ ఢీకొట్టారు. ఈ ప్రమాదాల్లో లక్ష్మీపతి, సునీత, పార్థసారథికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురినీ ప్రథమ చికిత్స నిమిత్తం ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేశాక తిరుపతికి తీసుకెళ్లారు. ధ్వంసమైన కారు, రెండు బైకులను స్వాధీనం చేసుకుని ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు.



ధ్వంసమైన కారు

పంటలపై ఆగని గజదాడులు

ఆందోళనలో రైతులు



పెరగాండ్లపల్లె వద్ద ధ్వంసమైన వరిపంట - రాచూరులో విరిచేసిన కంచె

యాదమరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లోని పంటలపై వారంరోజులుగా మూడు గుంపులుగా ఉన్న 25 ఏనుగులు దాడులు చేస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు.. రాచూరు, పెరగాండ్లపల్లె గ్రామ సమీపంలోని వరి,అరటి,చెరకు పంటలతోపాటు కంచెను ధ్వంసం చేశాయని బాధిత రైతులు రామమూర్తి, చిన్నబ్బ, వరదరాజులు తెలిపారు. ధ్వంసమైన పంటలను ఎఫ్‌బీవో డిల్లీరాణి, అటవీ సిబ్బంది శనివారం పరిశీలించారు. పగలంతా భూమిరెడ్డిపల్లె సమీపంలోని నుంజర్ల ప్రాజెక్టులో మాటు వేసిన ఏనుగుల గుంపు.. రాత్రయితే మూడు బ్యాచ్‌లుగా విడిపోయి పొలాలపై దాడి చేస్తున్నాయి. మరోవైపు ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించడానికి ప్రయత్నిస్తున్నామని అటవీ అధికారులు తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

మూడు నెలల తరువాత కేసు నమోదు

చౌడేపల్లె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తపై దాడి చేసిన వ్యక్తులపై ఎట్టకేలకు పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. బాధితుని కథనం మేరకు.. మండలంలోని కాటిపేరి పంచాయతీ అగిస్థిగానిపల్లెకు చెందిన గంగాధర్‌రెడ్డి పంచాయతీలో మొట్టమొదటి టీడీపీ జెండా ఎగురవేశారు. ఆయన్ను వైసీపీ నాయకులు గత ప్రభుత్వంలో ఇబ్బందులకు గురిచేసి అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త శివశంకర్‌రెడ్డి, అతని భార్య సుధారాణి పేరుతో గంగాధరరెడ్డి భూమికి పాసుపుస్తకం చేసుకున్నారని వాపోయారు. 2024 డిసెంబర్ 26న వైసీపీ కార్యకర్త శివశంకర్‌రెడ్డి, అతనితో పాటు సుధారాణి, హరీష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తనపై దాడి చేస్తే అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే అప్పట్లో కేసు నమోదు కాకుండా చేశారు. ఫలితం లేకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా న్యాయమూర్తి ఆదేశాలతో ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. మండలంలో కొందరు టీడీపీ నాయకులు అమ్ముడుపోయి వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని.. కూటమి ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలకు రక్షణ లేకుండా పోతుందని అవేదన గంగాధరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన నష్టాన్ని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

పాఠకులకు ముఖ్యగమనిక

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న మునిరాజు తదితరులు

పలమనేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శనివారం కార్యాలయలో పలమనేరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది మునిరాజు పూలమాలతో సన్మానించారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా నియమితులై మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి నుంచి నియామకపు పత్రాన్ని మునిరాజు అందుకున్నారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించినందుకు మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. న్యాయవాదులు రవి, సబ్బరామయ్య, బాబురెడ్డి, చంద్రశేఖర్, తిప్పారెడ్డి, మునెప్ప, సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో...

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాభారత ఉత్సవాల ప్రారంభం

- రూ.20 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం



భక్తుల కోసం నిర్మించిన శాశ్వత షెడ్డు

కల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు సచివాలయం-3 సమీపంలో ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో మహాభారత యజ్ఞంలో భక్తులు కూర్చునేందుకు రూ. 20 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. మహాభారత యజ్ఞం ఉత్సవాలు ఈనెల 24 నుంచి ఏప్రిల్ 10 వరకు నిర్వహించనున్నారు. ఆలయంలో 24న ధ్వజారోహణం, వ్యాస జననంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. భక్తులు పాల్గొని మహాభారత యజ్ఞం ఉత్సవాలు విజయవంతానికి కృషి చేయాలని కమిటీ సభ్యులు తెలిపారు

సిద్ధేశ్వరస్వామిని దర్శించుకున్న కురబ నాయకులు



సిద్దేశ్వరస్వామిని దర్శించుకున్న రాజగోపాల్ తదితరులు

కుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం జోగ్యానూరులో వెలసిన సిద్ధేశ్వరస్వామిని శనివారం కురబకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.రాజగోపాల్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రామచంద్ర, కుప్పం మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎం.సుబ్బులు దర్శించుకున్నారు. కురబ కులదైవమైన సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవర మహోత్సవం ఆదివారం జరుగనున్నందున సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. కదిరప్ప, గోవిందరాజులు, సంతూరప్ప, శ్రీనివాసులు, కురబ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిమారెమ్మ జాతర



సారె తీసుకొస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని డీకేపల్లెలో ప్రసన్న అగ్నిమారెమ్మ జాతర వైభవంగా జరిగింది. అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి సర్వాలంకరణలు చేశారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అమ్మవారికి ఊరేగింపుగా సారె తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వేలు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిలో నీటిగుంటల పనుల ప్రారంభం



నీటిగుంట పనులను ప్రారంభిస్తున్న మణి తదితరులు

కుప్పం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ అడవిములకలపల్లె, నూలుకుంట పంచాయతీలలో శనివారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి గుంటల పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో జ్యోతి, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎం.సుబ్బు, ఎన్ఆర్‌జీఎస్ టీఏ వెంకటేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, టీడీపీ నాయకులు మునిరత్నం, తిమ్మప్ప, రాము, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఘన సన్మానం



భాస్కర్‌ను సన్మానిస్తున్న అభిమానులు

పలమనేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్‌ను శనివారం పలువురు ఘనంగా సన్మానించారు. రెండురోజుల క్రితం పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎల్.భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలమనేరులోని ఆయన కార్యాలయంలో వాల్మీకి సంఘ నాయకులు పూలమాలలు , శాలువలతో సన్మానించారు. వాల్మీకి సంఘ నాయకులు వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అద్దాల నాగరాజు, మాజీ సర్పంచులు గంగప్ప, చలపతి, డాక్టర్ సుబ్రమణ్యం, మాడి శంకరప్ప, పొట్టగానిపల్లి నగేష్, ముత్తుకూరు సుబ్రహ్మణ్యం, రిటైర్డు టీచర్ రెడ్డెప్ప, ముదరం పల్లి గణపతి, గంగవరం బాలాజీ, దామోదర్, మార్లేపల్లి రెడ్డెప్ప, టి.ఎన్. బాలాజీ, రొంటకుంట్ల నరసింహులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి

పుంగనూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ పరిధిలో ఓ మోడల్‌ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సి.జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పుంగనూరులో జరిగిన యూటీఎఫ్ డివిజన్ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 60మందికి పైబడి విద్యార్థులున్న పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఏర్పాటు చేయాలన్నారు. 5 తరగతులు ఉన్న పాఠశాలలో ఐదుమంది ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని, 75 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు అదనంగా హెచ్‌ఎంను నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘ నాయకులు జీవీ. రమణ, జిల్లా నాయకులు మనిగండన్, ఈశ్వర్‌మహేంద్ర, సి.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, రెడ్డెప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కృష్ణమరాజు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణ సామాజిక బాధ్యత



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న జయశంకర్

పలమనేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి నివారణ ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని వైద్యఆరోగ్య శాఖ సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పిలుపు నిచ్చారు. మార్చి 24న జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పలమనేరు కాకాతోపు, ఎద్దుల సంత వీధిలోని అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాధితో బాధపడేవారు తుమ్మినప్పుడు తుంపర్లతో గాలిలో సూక్ష్మక్రిముల ద్వారా వ్యాధి ఇతరులకు వస్తుందని తెలిపారు. క్షయ వ్యాధి నివారణ అధికారి దయానంద్, టీబీ సూపర్‌వైజర్ జగదీశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకర్, దీప , వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరులో ఎమ్మార్పీఎస్ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

పలమనేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. అసెంబ్లీలో ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో వి.కోట అధ్యక్షులు రాము, నాయకులు వెంకటాచలపతి, డాక్టర్ కదిరప్ప, సోము, ఎంఎస్‌పీ నాయకులు శీనప్ప, పెద్దపంజాణి నాయకులు మణి, వెంకటరమణ, పాపన్న, పలమనేరు టీడీపీ నాయకులు నాగ, బాబు, గంగవరం నాయకులు వెంకటేసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత పరీక్షకు 166 మంది హాజరు



మాట్లాడుతున్న ఆచార్యులు ఈశ్వరరెడ్డి

పలమనేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం ఐదు పరీక్షా కేంద్రాల్లో సంస్కృత పరీక్షకు 166 మంది హాజరయ్యారు. మొత్తం 167 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరం తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామని పేర్కొన్నారు.

మనిషికి దయాగుణం అవసరం

పలమనేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మనిషికి సత్యం, దయాగుణాలు చాలా అవసరమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భాగవతం-భక్తి, తాత్వికత అనే అంశంపై రెండో రోజు జాతీయ సదస్సులో ఈశ్వరరెడ్డి మాట్లాడారు. పోతన లాంటి గొప్ప కవి తెలుగుగడ్డపై పుట్టడం తెలుగు ప్రజల అదృష్టమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు మాట్లాడుతూ అందరూ భాగవతం లాంటి కావ్యాన్ని చదవాలని కోరారు. వంగాల సంపత్‌రెడ్డి, సంచాలకులు డాక్టర్ వాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

రామకుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరులో అపోలో యూనివర్సిటీ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో రామకుప్పం బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హేమశ్రీ, సుఫియాలు విశేష ప్రతిభ కనబరిచారు. దీంతో యూనివర్సిటీ వారు ప్రథమ బహుమతిగా వారికి రూ.5 వేలు నగదు బహుమతి పంపారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఎంసీ ఛైర్మన్ కేశవరెడ్డి నగదు బహుమతిని అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే విద్యుత్ సరఫరా బంద్

పుంగనూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ పరిధిలో బకాయి ఉన్న ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నులు మూడు రోజుల్లోపు చెల్లించకుంటే విద్యుత్తు సరఫరా బంద్ చేయిసామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం, గంగజాతర, ఉగాది, రంజాన్ పర్వదినాల్లోని సెలవు రోజుల్లోనూ మున్సిపల్ కార్యాలయంలో పన్నుల బిల్లులు కట్టించుకోవడానికి ప్రత్యేక కౌంటర్లలో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గణితంలో పరమహంస యోగానంద విద్యార్థుల ప్రతిభ



శాంతిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్థాయి లో సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన గణిత విభాగం పరీక్షల్లో పరమహంస యోగానంద విద్యాలయ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం శనివారం అభినందించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాలు నడపడం నేరం

రొంపిచెర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సరైన రికార్డులు లేకుండా వాహనాలు నడపడం చట్టపరమంగా నేరమని రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం రొంపిచెర్ల క్రాస్, పట్టణంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులు, లైసెన్సులు పరిశీలించారు. సీటు బెల్టు పెట్టుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని, అధిక ఉష్ణోగ్రతలు ఉన్న సమయంలో, అధిక ప్రయాణికులతో ఆటోలు నడపరాదని సూచించారు.

టమోటా నార్లకు గిరాకీ ..!

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ఉత్సాహం





సోమలలో టమోటా సాగుకు సిద్ధంగా ఉంచిన పొలం, మార్కెట్‌కు తరలిస్తున్న టమోటాలు

సోమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టమోటాకు ధరలు లేకున్నా సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే టమోటా నార్లకు డిమాండ్ పెరుగుతోంది. సోమల మండలంలో ఈ మార్చి నెలలో పలువురు రైతులు నాట్లు చేసేందుకు దుక్కిలు సిద్ధం చేసుకుని నర్సరీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమల, పెద్దఉప్పరపల్లె, కందూరు, నడింపల్లె, నెల్లిమంద, ఇరికిపెంట పంచాయతీ పరిధిలోనే 1000 ఎకరాలకు మించి సాగుకు సిద్ధంగా ఉన్నారు. ఫిబ్రవరి, మార్చి మొదటి వారం సుమారు 1000 ఎకరాల్లో టమోటా సాగు చేసుకున్నారు. ప్రస్తుతం పలువురు రైతులు తోటల్లో చెట్లకు ఊతంగా కర్రలు నాటుతున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో 15 కిలోల బాక్సు మాత్రం రూ.150 లకు మించడం లేదు. ధరలు ఉన్నా.. లేకపోయినా రైతులు టమోటా ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. టమోటా సాగు లాటరీ పంటగా అధిక శాతం ఆ మోజులోనే ఉత్సాహం చూపుతున్నారు. మండలంలోని పలువురు రైతులతో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పెట్టుబడులు పెట్టి టమోటా సాగుకు ఉత్సాహం చూపుతున్నారు.

ముగిసిన సదరం శిబిరం

- ధ్రువీకరణ పత్రాల కోసం 5175 మంది రిజిస్ట్రేషన్





సదరం శిబిరానికి హాజరైన దివ్యాంగులు, దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, కడా పీడీ

కుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వాసుపత్రిలో రెండు రోజులపాటు నిర్వహించిన సదరం శిబిరం శనివారం నాటితో ముగిసింది. కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో శుక్రవారం గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలకు, శనివారం కుప్పం రూరల్ మండలం, కుప్పం మున్సిపాలిటీలకు సంబంధించి వికలత్వ ధ్రువీకరణ పత్రాల కోసం దివ్యాంగులు భారీగా హాజరయ్యారు. మొత్తం 5,175 మంది తమ పేర్లను ధ్రువీకరణ పత్రాల కోసం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సదరం శిబిరంలో పేర్లు నమోదు చేసుకున్న దివ్యాంగులకు వికలత్వ పరీక్షలు నిర్వహించి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. ఈ పత్రాలు ఉన్నవారందరూ ప్రభుత్వం అందించే ప్రయోజనాలు, పథకాలకు అర్హులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశకత్వంలో ఆయన ఆదేశాల మేరకు సదరం శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ సంప్రదాయం



సంప్రదాయ దినోత్సవంలో బీసీఎన్ తదితరులు

కుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ అచ్చమైన సంప్రదాయం భిన్నత్వంలో ఏకత్వం సాధించడమేనని బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సంప్రదాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మన భారతీయ సమాజంలోని భిన్న సంప్రదాయాలు, సంస్కృతులను తెలియజేయడానికి, అందరూ కలిసున్నామని ప్రపంచానికి చాటడానికి సంప్రదాయ దినోత్సవాన్ని ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. సంప్రదాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వారివారి సంప్రదాయానికి అనువైన దుస్తులు ధరించి కళాశాలకు వచ్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్, సీఈవో సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషణతోపాటు చదువు ముఖ్యం



శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన

కుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పోషకాహారంతోపాటు చదువు అందివ్వడం ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ కుప్పం సీడీపీవో ఎం.చంద్రకళ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా కుప్పం, గుడుపల్లె మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలకు చిన్నారుల అభివృద్ధి, వారికి అందించాల్సిన చదువు ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

- సోమల: అంగన్వాడీ కేంద్రాలు పోషణ వాటికలుగా మారాలని సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్ హరిత పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యకర్తల శిక్షణ తరగతుల్లో పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, పశువైద్యాధికారి చందనప్రియ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- చౌడేపల్లె: స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు రాణించాలి

- పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గంగవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మదర్‌థెరీసా కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ చదువులు భవిష్యత్తుకు కీలకమన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించుకొని పట్టుదలతో చదువుకోవాలని .. దేశానికి యువత సేవలు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, ఛైర్మన్ సునీల్, అకడమిక్ డైరక్టర్ రాజేంద్రరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడు, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, సుబ్బారెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు, అధికారులు

కల్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్‌షఫీ అన్నారు. పులిచెర్ల మండలం దేవళంపేట, కావేటిగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లిలో శనివారం అటవీశాఖ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటంలో అడవులు కీలకపాత్ర వహిస్తున్నా యన్నారు. అడవుల విస్తీర్ణత తగ్గితే వన్యప్రాణులు, ఇతర జీవజాతికే కాకుండా మానవ మనుగడకు ముప్పు తప్పదన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో కృష్ణమూర్తి, కళాజాత సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇఫ్తారు విందుకు చల్లా బాబుకు ఆహ్వానం



చల్లాతో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

రొంపిచెర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని చౌడేపల్లె మండలానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు ఇఫ్తారు విందుకు రావాలని శనివారం ఆహ్వానించారు. మర్రిమాకలపల్లెకు చెందిన సర్దార్, మౌలా, సయ్యద్‌బాషా, రసూల్, బాబుబాషా తదితరులు పాల్గొన్నారు.

- చౌడేపల్లె: మండలంలోని పెద్దూరుకు చెందిన మైనార్టీ నాయకులు శనివారం చల్లా రామచంద్రారెడ్డిని కలిసి సత్కరించారు. ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు.

ఆంజనేయస్వామి శిరస్సుపై పచ్చారపాము



రొంపిచెర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల సమీపంలోని కట్ట కింద శివాలయంలో శనివారం పచ్చారపాము ఆంజనేయ స్వామి విగ్రహానికి చుట్టుకుని దర్శనమిచ్చింది. భక్తులు ఈ సంఘటన చూసి ఆశ్చర్యానికి గురయ్యారు.

పాఠశాలల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

బైరెడ్డిపల్లె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తఇండ్లు, గంగినేపల్లె గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని కేజీబీవీ (కస్తూర్బా గురుకుల విద్యాలయం)లో ఆరో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వసియాపరహత్ కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ అనాథ పిల్లలు, బడి బయట ఉన్న పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బాలికలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే స్వీకరించడం జరుగుతుందని, 7, 8, 9, 10, ఇంటర్‌లో ఖాళీగా ఉన్న సీట్లుకు బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. వివరాలకు ఫోన్ నంబర్లు 7075159996, 7075039990లను సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, సీడీపీవో కల్పన తదితరులు

శాంతిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ, బాలలపై వేధింపులు, బాలల అక్రమ రవాణ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ సూచించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ముద్రించిన కరపత్రాలు, గోడపత్రికలను ఎంపీడీవో కార్యాలయంలో సీడీపీవో కల్పన, ఎంపీడీవో కుమార్ తదితరులు ఆవిష్కరించారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

చౌడేపల్లె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మౌలిక వసతులు కల్పనపై మండల ప్రత్యేకాధికారి నరేంద్రకుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. చారాల హైస్కూల్, దాదేపల్లె, చారాల అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్సీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేసి మౌలిక వసతుల కల్పించాలని సూచించారు. ఎంపీడీవో లీలామాధవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన పాల్గొన్నారు.

విజయపురాన్ని పారిశ్రామికంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే భానుప్రకాష్



టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలాన్ని పారిశ్రామికంగా తీర్చిదిద్దుతామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. శనివారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్యకర్తల కష్టంతో గెలిచానని, వారి బాగోగులు చూసుకునే బాధ్యత తనదే అన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు ఉంటానని, నాయకులు సమష్టిగా పనిచేస్తూ టీడీపీ పటిష్ఠతకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జంబాడలో వీఆర్వోలు, సర్వేయర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, పైసలు ఇస్తేనే ఫైలు కదులుతోందని టీడీపీ కార్యకర్త వాసు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. పలువురు రెవెన్యూ సమస్యలను తెలియజేశారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు శివలింగం, కొండూరు దాము, దశరథ రాజు, నారాయణరాజు, వేణుగోపాల్‌నాయుడు, గుణశేఖర్‌రెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి, సుధానాయుడు, శివయ్యనాయుడు, ఆర్ముగం, రవిచంద్రారెడ్డి, మురళీ, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార సంవత్సరంపై సదస్సు



సమావేశంలో ప్రసంగిస్తున్న డీసీవో నాగవర్ధన

చిత్తూరు సెంట్రల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): 2025ను ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని జిల్లా సహకార అధికారి నాగవర్ధన తెలిపారు. ఈ అంశంపై శనివారం డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలో జిల్లా సమాఖ్యలోని సభ్యులతో సదస్సు నిర్వహించారు. డీసీసీబీలో మహిళలకు ప్రవేశపెట్టిన అవని డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిశోర్ కుమార్, ఎస్‌డీఎల్‌సీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం: డ్వాక్రా మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరమని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కమ్యూనిటీ రిసోర్సుపర్సన్లకు శిక్షణకార్యక్రమం నిర్వహించారు.ఎల్డీఎం హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

25న ప్రత్యేక విద్యుత్ అదాలత్

వెదురుకుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సబ్ డివిజన్ ఆఫీసు ఆవరణంలో ఈనెల 25వ తేదీన ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ ఏడీఈ చంద్రబాబు శనివారం తెలిపారు. గంగాధరనెల్లూరు, కార్వేటినగరం, నగరి సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారులకు తెలియజేయవచ్చన్నారు. ఈ అదాలత్‌కు చైర్మన్ రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యుడు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరవుతారన్నారు.

27న 'షబ్-ఎ-ఖదర్' పండుగ

చిత్తూరు సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): 'షబ్-ఎ-ఖదర్' పండుగను ఈనెల 27వ తేదీన ముస్లింలు జరుపుకోవాలని ప్రభుత్వ ఖాజీ జనాబ్ మౌల్వి సయ్యద్ షా మొహమ్మద్ కమాలుల్లా జుహరి లతీఫ్ జునైది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున రాత్రి విశ్వశాంతి కోసం జాగారంతో అల్లా వద్ద దువా చేయాలన్నారు.

28న వరసిద్ధుడి ఆలయ హుండీ లెక్కింపు

ఐరాల(కాణిపాకం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీని ఈనెల 28వ తేదీన లెక్కించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆ రోజున ఉద్యోగులు ఎవరూ సెలవు పెట్టకూడదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరిశుభ్రతను పాటించండి

గుడిపాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని గుడిపాల వైద్యాధికారి సంధ్య సూచించారు. శనివారం గుడిపాల క్రాస్‌లోని బాలికల సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. సీహెచ్‌వో బాలసూర్యనారాయణ, ఏఎన్ఎంలు జబుశెల్వి, ఉమామహేశ్వరి, సుజన, స్వప్న తదితరులు పాల్గొన్నారు. కాగా, గుడిపాలలో ఎంపీడీవో శివరాజన్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి సుందరేశన్ తన సిబ్బందితో కలిసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి / ఎమ్మెల్యే జగన్మోహన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఈనెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవం తదితర అంశాలపై కార్యకర్తలు, నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని తెలిపారు. ఎక్కడెక్కడ సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, నీటి కొళాయిలు, తాగునీరు అవసరమో వివరాలు సేకరిస్తున్నామని వివరించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మేయర్ అముద, నేతలు చంద్రప్రకాష్, సుబ్బానాయుడు, సీఎం విజయ, మోహన్‌రాజ్, రాజశేఖర్, అశోక్ ఆనంద్ యాదవ్, ఈశ్వర్, పీటర్, శశికర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలను విస్మరిస్తే ఇంటికే: డీపీవో



కొమరగుంటలోని చెత్త సేకరణ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న సుధాకరరావు

వెదురుకుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాధ్యతలను విస్మరిస్తే ఇంటికెళ్లక తప్పదని సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకర రావు హెచ్చరించారు. శనివారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఐవీఆర్ఎస్‌కు పచ్చికాపల్లం, కొమరగుంట, వెదురుకుప్పం, పాతగుంట, నల్లవెంగనపల్లె గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయని తెలిపారు. ఈ గ్రామ పంచాయతీల్లో లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని చెప్పారు. గ్రామాల్లో రోడ్డు పక్కన చెత్త, పేడదిబ్బలు లేకుండా చూడాలన్నారు. అశ్రద్ధ వహిస్తే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఇంటిపన్నులు, లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలన్నారు. తాగునీటి పైపులైన్ల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. అలాగే పచ్చికాపల్లం గ్రామ సచివాలయాన్ని డీపీవో తనిఖీ చేశారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. కొమరగుంట గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కూడా సుధాకరరావు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఆర్చి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పరిసరాల పట్ల కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త సేకరణపై సూచనలిచ్చారు. ఆయనవెంట ఈవోపీఆర్డీ ఎల్.పురుషోత్తం ఉన్నారు.

నా ఇంటి స్థలాన్ని కాజేయడానికి సచివాలయ ఉద్యోగి యత్నం

రామానాయుడు పల్లె ఎస్సీ కాలనీవాసి ఆరోపణ



పొన్నుస్వామి

చిత్తూరు సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తన ఇంటి స్థలాన్ని కాజేయడానికి ఓ సచివాలయ ఉద్యోగి ప్రయత్నిస్తున్నారని గంగాధర నెల్లూరు మండలం రామానాయుడు పల్లె ఎస్సీ కాలనీకి చెందిన పొన్నుస్వామి ఆరోపించారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ఇంటి స్థలానికి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారని చెప్పారు. ఈ స్థలాన్ని మాపాక్షి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి కాజేయడానికి చూస్తున్నాడని తెలిపారు. ఉన్నతాధికారులు విచారించి, న్యాయం చేయాలని కోరారు.

సంక్షిప్తంగా..

కోరం లేక సమావేశం వాయిదా

ఐరాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల సర్వసభ్య సమావేశం కోరం లేక శనివారం వాయిదా పడింది. ఉదయం పది గంటలకు అధికారులు హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులు రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఎంపీడీవో కార్యాలయ అధికారులు తెలిపారు.

27న సంత, దుకాణాల వేలం

గంగాధరనెల్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులో వారపు సంతతో పాటు పంచాయతీ దుకాణాలను ఈనెల 27వతేదీన మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహించనున్నారు. పంచాయతీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని కార్యదర్శి చంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నేతల సంబరాలు

పూతలపట్టు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు పూతలపట్టులో శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కత్తి శంకరయ్య, సంగీతం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి పూజలు



నగరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని కాళభైరవస్వామి ఆలయంలో శనివారం అష్టమి పూజలను నిర్వహించారు. అలాగే అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారి పంపిణీ చేశారు.

నీరు సమస్త జీవానికి మూలం

చిత్తూరు అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీరు సమస్త జీవానికి మూలమని వైసీపీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి చెప్పారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొంగారెడ్డిపల్లెలో పలు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. నేతలు చంద్రశేఖర్, కేపీ శ్రీధర్, మనోహర్ రెడ్డి, శివారెడ్డి, జ్ఞాన జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

యాదమరిలో చిరుజల్లులు

యాదమరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యాదమరి, పెరుమాళ్లపల్లె, కోణాపల్లె తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో జనం ఉపశమనం పొందారు.

నీటి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

చిత్తూరు రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. ఇందుకోసం రైతులు తమ పొలాల్లో వీలైనన్ని ఇంకుడు గుంతలను తవ్వుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు పంచాయతీ, తెల్లగుండ్లవలస గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పంటసంజీవని, ఇంకుడు గుంతల తవ్వకాన్ని ఆయన ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయుడు చంద్రప్రకాష్, డ్వామా పీడీ రవికుమార్, ఏపీడీ సుబ్రహ్మణ్యం, మండలస్థాయి నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, జగదీష్, మేషాక్, తాళంబేడు సర్పంచ్ అమరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు : దంపతులకు గాయాలు



నుజ్జయిన కారు

తవణంపల్లె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కృష్ణకుమార్(36) తన భార్య మానసతో కలిసి కారులో తిరుపతికి వచ్చారు. శనివారం తిరుగుప్రయాణంలో మార్గమధ్యంలో తెల్లగుండ్లపల్లె సమీపంలోని నయారా పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కృష్ణకుమార్‌కు తీవ్రగాయాలవగా, మానసకు స్వల్ప గాయాలైంది. బాధితులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు.

150 గ్రాముల బంగారం చోరీ



చిత్తూరు అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మాపాక్షిలో ఓ ఇంట్లో 150 గ్రాముల బంగారం చోరీకి గురైంది. తాలూకా ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. మాపాక్షిలో హైస్కూల్ ఎదురుగా ఉన్న ఇంట్లో మల్లికార్జున రెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి ఇద్దరు కుమారులు యూఎస్‌లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఉన్న 150 గ్రాముల బంగారం చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. 15 ఏళ్లుగా ఇంట్లో పనిమనిషిగా ఉన్న మహిళపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన సద్గుణేశన్

గుడిపాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి చెన్నైకి వెళ్తున్న కారు శనివారం బెంగళూరు - చెన్నై రహదారిలోని గట్రాళ్లమిట్ట సమీపానికి వచ్చేసరికి బైక్‌పై వస్తుండిన కాట్పాడికి చెందిన సద్గుణేశన్, శేఖర్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సద్గుణేశన్, శేఖర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సద్గుణేషన్ మృతిచెందాడు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రులకు నారాయణస్వామి పరామర్శ

వెదురుకుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని శనివారం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. శుక్రవారం ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లె సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడ్డ ప్రమాదంలో వెదురుకుప్పం మండలం యనమలమంద ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు గాయపడ్డారు. వీరిలో బుడిగెమ్మ, పుష్పావతమ్మ, గోవిందమ్మ, చిన్నమ్మ తదితరులు స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయనవెంట నాయకులు గురవారెడ్డి, కామసాని పద్మనాభరెడ్డి, చలంపాళ్యం సుకుమార్ ఉన్నారు.

పోలీసుల రక్షణ కోరిన ప్రేమ జంట

పాలసముద్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం గ్రామానికి చెందిన చరణ్, వరదయ్యపాళెం మండలానికి చెందిన శరణ్య ప్రేమవివాహం చేసుకున్నారు. తమకు తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని పోలీసులను శనివారం కోరారు. ఇద్దరూ మేజర్లు కావడంతో వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప పిలిపించారు. వారితో మాట్లాడి ఒప్పించాక చరణ్ తల్లిదండ్రులవెంట ప్రేమజంటను పంపించారు.

హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం



హైకోర్టు జడ్జి సురేష్‌రెడ్డితో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నేతలు

చిత్తూరు లీగల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు జడ్జి సురేష్‌రెడ్డిని జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు శనివారం ఆర్అండ్‌ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని సన్మానించారు. సంఘం నాయకులు గోపీనాథ్ రెడ్డి, లక్ష్మీపతి, బాలసుందర్, రవీంద్రారెడ్డి, రాజేష్, హరికృష్ణ, ప్రభాకర్ రెడ్డి, సంతోష్, దిలీప్, యువరాజు, రెడ్డెప్ప, చంద్రశేఖర్, భ్రమరాంబ, పౌనకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో..

ఐరాల(కాణిపాకం): హైకోర్టు న్యాయమూర్తి శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, తహసీల్దార్ మహేష్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్లు వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి, సీఐ శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: జడ్పీ మీటింగ్ హాలులో శనివారం హైకోర్టు జడ్జి, చిత్తూరు జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డిని కలెక్టర్ సుమిత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

బడిలో నూతన ఆడిటోరియం ప్రారంభం



వివరాలు తెలియజేస్తున్న హెచ్ఎం సుధాకర్

పాలసముద్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలరాజుపురం జడ్పీ హైస్కూల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియాన్ని శనివారం ప్రారంభించారు. హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ.. బెంగళూరుకు చెందిన ఏత్రియ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ సీఎస్ సుందర్‌రాజు రూ.7లక్షలతో ఈ ఆడిటోరియం నిర్మించారని చెప్పారు. ఈ సందర్భంగా సుందర్‌రాజును ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. ఎంఈవో-2 గిరిజ, గ్రామస్తులు గంగరాజు, శాంతిరాజు, బాలరాజు, నాగరాజు, నరసరాజు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 41 మంది 'విజయం' విద్యార్థుల ఎంపిక



చిత్తూరు సెంట్రల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మిట్టూరులోని విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ బీకామ్, బీసీఏ చదువుతున్న 41 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. ప్రముఖ బహుళ జాతి సంస్థ ఆల్‌డిజిటెక్ శనివారం తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.2.25 లక్షలని చెప్పారు. వీరిని అధ్యాపక బృందంతో కలిసి అభినందించారు.

చిన్నారులకు మెరుగైన విద్యనందించాలి: సీడీపీవో

వెదురుకుప్పం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మెరుగైన విద్యనందించాలని కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పద్మసునంద సూచించారు. శనివారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో 'పోషణ బి-పడాయి బి' కార్యక్రమం ముగింపు సమావేశం జరిగింది. సూపర్‌వైజర్లు శకుంతల, భారతి, పాల్గొన్నారు. ● కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇందిర, శామిని, అంగన్వాడీ వర్కర్లు హాజరయ్యారు.

గంగాధరనెల్లూరు: మండలంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ, సూపర్‌వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ, పలువురు అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. వివిధ రకాల పెయింటింగ్‌తో వేసిన చార్ట్‌లు, ఫ్లవర్‌వాజులు తదిరాలపై చిన్నారులకు ఆకర్షణ పెరిగేలా చేయడంపై అవగాహన కల్పించారు.

గుడిపాల: మండలంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో శ్యామసుగుణ కుమారి అంగన్వాడీ టీచర్లు బుజ్జి, అనిత, నాగసుధ, శాంతి, అన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం: ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల దాహార్తి తీర్చడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం దుర్గానగర్ కాలనీలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి సరఫరా ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అడవిపల్లి రిజర్వాయర్ నుంచి నగరానికి నీరందించి చిత్తూరు నియోజకవర్గానికి శాశ్వత నీటి సమస్య పరిష్కారం చూపుతామని చెప్పారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, పార్టీ నేతలు చంద్రప్రకాష్, గుడిపాల బాలాజి, 16వ వార్డు ఇన్‌చార్జి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఫారంపాండ్ పనులను ప్రారంభిస్తున్న చెంగ్రాయయాదవ్

వెదురుకుప్పం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ కార్వేటినగరం మండలాధ్యక్షుడు చెంగ్రాయయాదవ్ అన్నారు. శనివారం అమ్మపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను ప్రారంభించారు. ఏపీవో జాహ్నవి పాల్గొన్నారు.